# సాక్షి ప్రకాశం

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024






**అధికార యంత్రాంగం అప్రమత్తం**

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ పరిశీలించారు.

- 8లో



**పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
26.3/25

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### బత్తులను పరామర్శించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి



బత్తుల బ్రహ్మానందరెడ్డిని పరామర్శిస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

**ఒంగోలు సిటీ:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు ఒంగోలు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డిని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. బత్తుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తర్వాత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను బ్రహ్మానందరెడ్డి శాలువాతో సన్మానించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ బొట్ల రామారావు, చుండూరు రవి, కె.వి.రమణారెడ్డి, రామా శ్రీను, వెంకటేశ్వరరావు, క్రిష్ణపాటి శేఖర్‌రెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాస్, నరాల రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

### సాంకేతిక సమాచారాన్ని రైతులకు చేరవేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

**దర్శి:** వ్యవసాయ సాంకేతిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలని జిల్లా వ్యవసాయాధికారి, ఆత్మ పీడీ ఎస్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి సాంకేతిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలని సూచించారు. పంట నమోదు, సోషల్ ఆడిట్, పొలం పిలుస్తోంది వంటి కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఆత్మ డీపీడీ ఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ వివిధ పంటల్లో రైతులతో చేయించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు, కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్‌బాబు మాట్లాడుతూ కంది, పత్తి, వరి, మినుము, పెసర వంటి పంటల్లో పురుగులు, తెగుళ్లు, యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. ఏఆర్ఎస్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ పి.సంధ్యారాణి మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలు, అందుబాటులో ఉన్న విత్తన రకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ సమన్వయ కర్త ఎస్ రామ్మోహన్, సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.బాలాజీనాయక్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

# తమ్ముళ్లకే కిక్కు..



అంతా అనుకున్నట్లుగానే జరుగుతోంది. మద్యం వ్యాపారాన్ని అధికార తెలుగుదేశం పార్టీ సొంతం గుప్పిట్లోకి తీసుకుంది. ఒక వ్యూహం ప్రకారం సిండికేట్ వ్యాపారానికి తెరదీసి మొత్తం మద్యం వ్యాపారాన్ని అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల చేతుల్లో పెట్టడం పూర్తయిపోయింది. కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దోచేసేందుకు రంగం సిద్ధమైంది.
ఇక రేపో మాపో ప్రతి ఊరికి మద్యం దుకాణం వెలుస్తుంది. వీధివీధికీ బెల్టు షాపులు తలుపులు తెరచుకుంటాయి. తాగినోడికి తాగినంత మద్యం, తాగకపోతే తంతాం అన్నట్లుగా పరిస్థితి తయారవడం ఖాయం.

- వ్యూహం ప్రకారం సిండికేట్ వ్యాపారం
- అనుభవం కలిగిన పాత వ్యాపారులను దరఖాస్తు చేసుకోనీయకుండా బెదిరింపులు
- తమ్ముళ్లతోనే దరఖాస్తుల తతంగం
- నాణ్యమైన మద్యం అంటూ ప్రచారం
- బ్రాండ్ మద్యం పేరుతో బ్యాండ్
- ప్రజల సంపాదనకు చిల్లు పెట్టి పార్టీ ఎమ్మెల్యేలకు సంపద సృష్టి
- సంక్షేమం పట్టకుండా మద్యం వ్యాపారంలో ప్రభుత్వం తలమునకలు

**సాక్షి ప్రతినిధి, ఒంగోలు:** తెలుగు తమ్ముళ్లలో తెగ ఉత్సాహం కనిపిస్తోంది. మద్యం వ్యాపారానికి అధికారికంగా లైసెన్సు దక్కడంతో కిక్కెక్కింది. జిల్లాలో మొత్తం 171 మద్యం దుకాణాలకు సోమవారం జిల్లా కేంద్రమైన ఒంగోలులోని అంబేడ్కర్ భవన్లో లాటరీ నిర్వహించి లైసెన్సులు మంజూరు చేశారు. రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ఒంగోలు, చీమకుర్తి, సింగరాయకొండ, పొదిలిలో దుకాణాలకు 1వ నంబర్ కౌంటర్లో లాటరీ నిర్వహించగా, దర్శి, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెం దుకాణాలకు 2వ కౌంటర్లో లాటరీ తీశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా సమక్షంలో తొలి డ్రా తీశారు. తొలి డ్రాలో ఒంగోలుకు చెందిన నెప్పల శ్రీనివాసరావుకు మద్యం దుకాణం దక్కింది. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రెండో కౌంటర్‌లో తీసిన చివరి డ్రాలో త్రిపురాంతకం దుకాణానికి దరఖాస్తు చేసుకున్న దొడ్డా వెంకట నారాయణ దక్కించుకున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన లక్కీ డ్రా మధ్యాహ్నం ఒంటి గంటకల్లా పూర్తయింది. ఎలాంటి గొడవలు, ఘర్షణలు జరగకుండా ప్రశాంతంగా డ్రా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తాలూకా సీఐ అజయ్ కుమార్, వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు, టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, రూరల్ సీఐ శ్రీకాంత్ భద్రతా చర్యలను పర్యవేక్షించారు.

**ప్రహసనంలా కొనసాగిన లాటరీ..**

లాటరీలో మొత్తం దుకాణాలు తెలుగుదేశం నాయకులు, వారి అనుచరులకే దక్కాయి. జిల్లాలోని 171 దుకాణాల్లో 95 శాతం దుకాణాలు తమ్ముళ్ల చేతుల్లోకి వెళ్లాయి. మిగిలిన అరకొర దుకాణాలు కొద్దిమంది వ్యాపారులకు దక్కాయి. అయితే ఈ దుకాణాలను కూడా వారికి దక్కకుండా అధికార పార్టీ నాయకులు బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. మాకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వాలని, లేకుంటే నువ్వు నీవ్యాపారం ఎలా చేస్తావో మేము చూస్తామంటూ హెచ్చరిస్తున్నట్లు సమాచారం. దాంతో వ్యాపారులు ఎమ్మెల్యేల అనుచరులతో బేరసారాలు చేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. లాటరీలో వరసగా తెలుగు తమ్ముళ్ల పేర్లే వస్తుండడంతో ఇంత మాత్రానికి లాటరీ ఎందుకంటూ కొండపి ప్రాంతం నుంచి వచ్చిన ఒక మహిళ వ్యాఖ్యానించడం గమనార్హం. మద్యానికి టెండర్ వేసిన బడా బాబులు ఎవరూ లాటరీ ప్రక్రియలో పాల్గొనలేదు. వారి ప్రతినిధులను పంపించి తతంగం నడిపించారు.



లాటరీ తీస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, లాటరీలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రైవేటు వ్యక్తిగత సిబ్బంది అనీల్ (సర్కిల్‌లో)

**ఒంగోలు నుంచి త్రిపురాంతకం వరకు...**

ఒంగోలు నుంచి త్రిపురాంతకం వరకు మొత్తం మద్యం దుకాణాలన్నీ తమ్ముళ్లకే దక్కడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, అతడి సోదరుడు పోర్టులు, హార్బర్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దామచర్ల సత్య పీఏలకు మద్యం దుకాణాలు లభించాయి. మార్కాపురం నియోజకవర్గంలోని అత్యధిక దుకాణాలను ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అనుచరులు దక్కించుకున్నారు. మార్కాపురం పట్టణంలోని 4 దుకాణాలకు గాను 2 దుకాణాలు, రూరల్‌లో ఒక దుకాణం టీడీపీ నాయకులు దక్కించుకున్నారు. కొనకనమిట్ల మండలంలో టీడీపీ నాయకులు ముక్కాల నరసింహారెడ్డి, పరమేశ్వరరెడ్డిలకు 2 దుకాణాలు దక్కాయి. తర్లుపాడు మండలంలో 2 దుకాణాలు ఉండగా సిండికేట్‌గా తయారైన తమ్ముళ్లు రెండు దుకాణాలను చేజిక్కించుకున్నారు. పొదిలి పట్టణం, రూరల్‌లో ఒక్కో దుకాణం చొప్పున దక్కించుకున్నారు. మిగిలిన దుకాణాల్లో మార్కాపురం 1 దుకాణం జనసేన సొంతం చేసుకుంది. కొనకనమిట్లలో ఒక దుకాణం జనసేన నాయకుడు, న్యాయవాది నాగరాజుకు దక్కింది. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పీఏ అనిల్‌కు మద్యం దుకాణం దక్కింది. నగర టీడీపీ అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు బంధువుకు కూడా మద్యం దుకాణం వచ్చింది. కనిగిరి నియోజకవర్గంలో అత్యధిక దుకాణాలు టీడీపీ నాయకులు, శ్రేణులకు దక్కాయి. వారిలో అధిక శాతం కొత్త మొహాలు కావడం గమనార్హం. గిద్దలూరు నియోజకవర్గంలోని కంభంలో 5 దుకాణాలుండగా మొత్తం దుకాణాలు ఎమ్మెల్యే ముత్తముల అశోక్ రెడ్డి అనుచరులకు దక్కాయి. సిండికేట్‌గా దరఖాస్తు చేసిన తెలుగు తమ్ముళ్లు దుకాణాలను సొంతం చేసుకున్నారు. మాజీ జెడ్పీటీసీ కొత్తపల్లి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ఆరెపల్లి మల్లికార్జున రావు, డెంటల్ శ్రీను, డీవీఎస్ రెడ్డి, అనిల్ రెడ్డిలకు దుకాణాలు వచ్చాయి. ఈ సిండికేట్ సభ్యులు 40 వరకు దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. గిద్దలూరు నుంచి డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి తన స్నేహితులతో కలిసి 125 దరఖాస్తులు చేయడం విశేషం. దర్శి నియోజకవర్గంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మి 50 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా మద్యం దుకాణాలు కూడా తామే నిర్వహిస్తామని నెలవారీ లాభాలను పంచిస్తామని చెప్పి కొత్తగా ప్రతిపాదనలు చేస్తుండటంతో పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు.

**పొరుగు జిల్లా వాసులకు దక్కిన దుకాణాలు..**

యర్రగొండపాలెం నియోజకవర్గంలో పొరుగు జిల్లాలకు చెందిన వారు దుకాణాలను ఎగరేసుకొని పోయారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని మొత్తం 19 దుకాణాలకు గాను సింహభాగం తెలుగు తమ్ముళ్లకే దక్కాయి. అయితే ఈ నియోజకవర్గంలో పొరుగు జిల్లాలకు చెందిన టీడీపీ నాయకులకు 2 దుకాణాలు దక్కాయి. పెద్దారవీడు మండలంలో 3 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా అందులో ఒకటి పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన టీడీపీ నాయకులకు దక్కింది. త్రిపురాంతకం మండలంలో కూడా ఒక దుకాణాన్ని వినుకొండ తమ్ముళ్లు దక్కించుకున్నారు. పుల్లలచెరువు మండలంలో 3 దుకాణాలకు గాను ఒక దుకాణాన్ని పల్నాడు జిల్లా గురజాలకు చెందిన టీడీపీ నాయకులు చేజిక్కించుకున్నారు. అయితే పొరుగు జిల్లాల మద్యం సిండికేట్‌తో యర్రగొండపాలెం టీడీపీ నాయకులు బేరసారాలు చేస్తున్నట్లు సమాచారం.

**10 మంది మహిళలకు లక్కీ ఛాన్స్...**

జిల్లాలోని 171 దుకాణాలకు గాను అత్యధిక సంఖ్యలో మహిళలు కూడా దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో 10 మందికి మద్యం దుకాణాలు లభించాయి. ఈ పది మందిలో కూనం సత్యవతి అనే మహిళకు రెండు దుకాణాలు దక్కాయి. సింగరాయకొండలోని దుకాణం నంబర్ 54, తాళ్లూరు మండలంలోని దుకాణం నంబర్ 100 ఆమెకు దక్కాయి. ఒక మహిళకు రెండు దుకాణాలు రావడం విశేషం. కాగా కొందరు వ్యాపారులు 40 దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నా ఒక్కటి కూడా దక్కకపోవడంతో విచారంతో వెనుదిరిగారు.

**ధర్నాతో ఉలిక్కిపడిన పోలీసులు...**

మద్యం టెండర్ లాటరీ ప్రక్రియ జరుగుతున్న సమయంలో మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు రావడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. మద్యం టెండర్లను రద్దు చేయాలని, మద్యం దుకాణాల లాటరీలను ఆపివేయాలంటూ నినాదాలు చేస్తూ నిరసన చేపట్టడంతో అంబేడ్కర్ భవనం బయట కాసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిరసన చేస్తున్న మహిళా నాయకులతో దురుసుగా ప్రవర్తించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారిని అరెస్టు చేసిన పోలీసులు పాలు రవాణా చేస్తున్న ఒక ఆటోలో తరలించడం గమనార్హం. అంతేకాకుండా తాలూకా సీఐ అజయ్ కుమార్ నిరసనకారుల చేతుల్లో ఉన్న ఫ్లెక్సీని లాక్కొని పక్కన పడేయడమే కాకుండా మీ అంతు చూస్తానంటూ బెదిరించాడని మహిళా నాయకులు ఆరోపిస్తున్నారు.



అంబేడ్కర్ భవన్ ఎదుట వర్షంలో వేచి ఉన్న మద్యం టెండర్‌దారులు

### వ్యూహాత్మకంగా సిండికేట్ దరఖాస్తులు..

దరఖాస్తుల దగ్గర నుంచే మద్యం దుకాణాలన్నీ చేజిక్కించుకునేందుకు తెలుగుదేశం ఎమ్మెల్యేలు ప్లాన్ చేశారు. ముందుగా మద్యం దుకాణాలకు ఇతరులు దరఖాస్తు చేయకుండా కట్టడి చేశారు. ఆ తరువాత ప్రతి దుకాణానికి 15 నుంచి 25 మంది వరకు సిండికేట్ చేసి దరఖాస్తులు వేయించారు. సిండికేట్‌లో ఒక్కొక్కరి పేరు మీద రెండు, మూడు దుకాణాలకు దరఖాస్తులు చేయించారు. అలా ప్రతి దుకాణానికి కనీసం 11 నుంచి 20 వరకు దరఖాస్తులు చేయించి లాటరీకి వెళ్లారు. సహజంగానే అక్కడ ఏ టోకెన్ తీసినా తెలుగు తమ్ముళ్ల సిండికేట్ సభ్యుడికే లాటరీ తగులుతుంది. తద్వారా మద్యం దుకాణాలను లీగల్‌గా సొంతం చేసుకున్నారు. ఎక్కడైనా ఒకటీ అర ఇతరులకు దక్కితే వారితో కూడా మాట్లాడేందుకు ఒక టీంను సిద్ధం చేసుకున్నారు. ఇలా జిల్లాలోని మద్యం దుకాణాలన్నీ వారికే దక్కాయని మద్యం వ్యాపారంలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఒక పాత వ్యాపారి చెప్పారు.

### సంక్షేమాన్ని గాలికొదిలి మద్యం వ్యాపారమా..

- మద్యం టెండర్లు అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళా సంఘాలు
- అంబేడ్కర్ భవనం ఎదుట నిరసన ధర్నా
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మహిళా సంఘాల నేతలపై సీఐ దురుసు ప్రవర్తన



మహిళా సంఘాల నేతలను బలవంతంగా లాక్కెళ్తున్న మహిళా పోలీసులు

**ఒంగోలు టౌన్:** ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి మద్యం వ్యాపారాన్ని చేస్తోందని, ఎన్నో ఆశలతో ఓట్లేసి గెలిపించిన మహిళలను, ప్రజలను వంచిస్తోందని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి బి.పద్మ తీవ్రంగా ఖండించారు. సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన మద్యం టెండర్ల లాటరీని వ్యతిరేకిస్తూ మహిళా సంఘాలు నిరసన చేపట్టాయి. అంబేడ్కర్ భవన్ ఎదుట ధర్నాకు దిగిన మహిళా సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మహిళా సంఘాల నాయకుల పట్ల తాలూకా సీఐ దురుసుగా ప్రవర్తించారు. వారి చేతుల్లోని బ్యానర్ ఫ్లెక్సీని లాగేసి విసిరేశారు. ''చెప్పినమాట విని వెళ్లకపోతే రేపు మీరే బాధపడతారు. మీసంగతి రేపు చూస్తాం. మీరు కొద్ది మంది ఇక్కడ ధర్నా చేస్తే ఏమవుతుంది. మీ ఇష్టంవచ్చినట్టు చేస్తుంటే మేం ఊరుకోం'' అంటూ సీఐ బెదిరింపులకు దిగినట్లు మహిళా సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాణ్యమైన మద్యం మహిళలకు రక్షణ ఇస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సంతోషంతో చౌకగా మద్యం అందించడం ద్వారా ఏం సాధించాలనుకుంటున్నారో అర్థం కావట్లేదని చెప్పారు. మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకోవడం విచారకరమని, నిరుపేదల కష్టాన్ని సంపదగా మలుచుకోవాలనుకోవడంకంటే బాధాకరమైన విషయం మరొకటి లేదన్నారు. సమాజంలో అశాంతికి అలజడికి కారణమైన మద్యాన్ని నిషేధించాల్సిన ప్రభుత్వమే నూతన పాలసీ తీసుకొచ్చి విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు రూపకల్పన చేయడం సిగ్గుచేటని విమర్శించారు. మద్యం, మత్తు మందుల ప్రభావంతో చెడు మార్గాలు పట్టిన యువత చేజేతులా జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో కన్నుమిన్ను కానరాకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహించడం సమర్థనీయం కాదని హితవుపలికారు. ఈ నిరసనలో ఐద్వా నాయకులు జి.ఆదిలక్ష్మి, ఎస్ మాలతి, బి.పెద్ద గోవిందమ్మ, పీవోడబ్ల్యూ నాయకులు అమ్మాజీ, సుజాత, విద్యార్థి సంఘాల నాయకులు సీహెచ్ వినోద్, వీరాస్వామి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళల నుంచి బ్యానర్ లాగేసుకుంటున్న సీఐ

# ముంచెత్తిన ముసురు

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- 25.5 మి.మీ సరాసరి వర్షపాతం నమోదు
- డ్రైనేజీల నిర్వహణ సరిగా లేక లోతట్టు ప్రాంతాలు జలమయం
- నేడు అన్ని విద్యా సంస్థలకు సెలవు
- మరో నాలుగు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాల సూచన



భాగ్యనగర్ 4వ లైనులో డ్రైనేజీలు పొంగి నిలిచిన వర్షం నీరు



వర్షం నీటిలో జిల్లా జలవనరుల శాఖ ఎస్ఈ కార్యాలయ భవనం



టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లోకి చేరిన నీరు



ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

**ఒంగోలు అర్బన్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా వానలు ముసురుపట్టి కురుస్తున్నాయి. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో మరో నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో యంత్రాంగం జాగ్రత్త చర్యల్లో నిమగ్నమయ్యారు. మండల స్థాయి నుంచి కలెక్టరేట్ వరకు కంట్రోలు రూములు ఏర్పాటు చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా వారిని హెచ్చరించారు. భారీవర్షాల నేపథ్యంలో మంగళవారం కూడా జిల్లాలో అన్నీ అంగన్‌వాడీ, పాఠశాలలు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా సాయంత్రానికి సరాసరి 25.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎవరూ నాలుగు రోజుల పాటు అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికార యంత్రాంగం సూచిస్తోంది. భారీ వర్షాలు కురవడంతో జిల్లాలో పలు రహదారులు, ఊళ్లలోని రోడ్లు దెబ్బతిన్నాయి. డ్రైనేజీలు సక్రమంగా నిర్వహించకపోవడంతో డ్రైన్‌లు పొంగి రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. జిల్లా కేంద్రంలో ఒంగోలులో బస్టాండ్ సెంటర్ నుంచి ఏ కాలనీ చూసినా రోడ్లన్నీ జలమయం అయ్యాయి. శివారు ప్రాంతాల్లోని కాలనీల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. వర్షపు నీరు కాలనీల్లో చేరడంతో కనీసం రాకపోకలకు కూడా ఇబ్బందులు తలెత్తాయి. కలెక్టర్ తమీమ్ అన్సారియా మండల, జిల్లా స్థాయి అధికారులకు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి భారీ వర్షాలకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. తీర ప్రాంత మండలాల్లో మరింత అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను గమనించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను తుఫాన్ షెల్టర్‌లకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లు ఏవైనా ప్రమాదకర స్థితిలో ఉంటే వాటిలో ఉండే విద్యార్థులను తక్షణమే ఇతర హాస్టళ్లలోకి తరలించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, విద్యుత్, రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల, వైద్య, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య కార్మికుల సెలవులు రద్దు చేశారు. ప్రజలకు, వివిధ శాఖల సమన్వయం కోసం కలెక్టరేట్‌లో 1077 టోల్‌ఫ్రీ నంబర్‌తో కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశారు. డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లోను కంట్రోలు రూములు ఏర్పాటు చేశారు. కంట్రోలు రూములో పని చేసే సిబ్బంది వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తెలియచేసి ప్రతి గంటకు నివేదిక అందజేయాలన్నారు.

**కలెక్టరేట్ కంట్రోలు రూమును పరిశీలించిన కలెక్టర్**

జిల్లాలో భారీ వర్షాల పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోలు రూము, మీడియా వాచింగ్ రూమును కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పరిశీలించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాకు సంబంధించి మీడియాలో వస్తున్న తుఫాన్ సంబంధిత అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు సంబంధిత సమాచారాన్ని పై అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు.



కొత్తకోట వాగువద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న జేడీ

**జిల్లాలో 25.5 మి.మీ సరాసరి వర్షపాతం**

సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్నీ మండలాల్లో సరాసరి 25.5 మిల్లీ మీటర్లుగా నమోదైంది. సింగరాయకొండలో అత్యధికంగా 59.6 మి.మీ నమోదైంది. పొన్నలూరు 48.4, టంగుటూరు 44.4 మి.మీ, జరుగుమల్లి 41.2, సీఎస్‌పురం 39.6, కొత్తపట్నం 39.6 మి.మీ, ఒంగోలు 38.4 మి.మీ, పీసీపల్లి 34.6, మద్రిపూడి 32, తాళ్లూరు 32.4, చీమకుర్తి 31.2, కనిగిరి 30.2, నాగులుప్పలపాడు 29.8, కొండపి 28, కొనకనమిట్ల 27.8, వెలిగండ్ల 27, కురిచేడు 25.6, సంతనూతలపాడు 25, ముండ్లమూరు 24.2, హెచ్‌ఎంపాడు 23.6, పామూరు 23.8, దొనకొండ 23.4, మద్దిపాడు 23, పొదిలి 22.2, దర్శి 21.4, పెద్దారవీడు 19, మార్కాపురం 17.2, బేస్తవారిపేట 16.4, తర్లుపాడు 16.2, కంభం 16, కొమరోలు 15, దోర్నాల 14, అర్ధవీడు 14, గిద్దలూరు 12.2, రాచర్ల 12, త్రిపురాంతకం 10.4, యర్రగొండపాలెం 5.6, పుల్లలచెరువు 2.8, మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

**ఖరీఫ్, రబీ పంటలపై ప్రభావం**

**ఒంగోలు సబర్బన్:** చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి జిల్లాలో ఇప్పటి వరకు సక్రమంగా వర్షాలు కురవనే లేదు. పశ్చిమ ప్రకాశంలో అయితే బోర్లలో నీళ్లు అడుగంటాయి. కనీసం అల్పపీడన ద్రోణి ప్రభావంతోనైనా వర్షాలు పడుతుండటంతో జిల్లాలోని రైతాంగం సంతోషంతో ఉన్నారు. ఈ వర్షంతో అటు రబీలోనూ, ఇటు ఖరీఫ్‌లోనూ వేసిన పంటలకు కొంత ఊపిరులూదినట్లయింది. జిల్లాలో మొదటి రోజు ఆదివారం పెద్దారవీడు, దోర్నాల, పుల్లలచెరువు, త్రిపురాంతకం మినహా జిల్లాలోని 34 మండలాల్లో వర్షాలు కురిశాయి. మొదటి రోజు జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో అత్యధికంగా 75.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఆ తరువాత పొన్నలూరు మండలంలో 65.2 మిల్లీ మీటర్లు, సీఎస్ పురంలో 55.4, జరుగుమల్లి 53.8, కొండపిలో 48.8, సింగరాయకొండలో 47.2, పామూరు 45, టంగుటూరు 40.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. 10 మిల్లీ మీటర్ల నుంచి 40 మిల్లీ మీటర్లలోపు వర్షం పడిన మండలాల్లో కొత్తపట్నం, పీసీపల్లి, మద్దిపాడు, సంతనూతలపాడు, హెచ్‌ఎం పాడు, ఎన్‌జిపాడు, వెలిగండ్ల, పొదిలి, కనిగిరి, యర్రగొండపాలెం, మద్రిపూడి, చీమకుర్తి మండలాలు ఉన్నాయి. మిగతా మండలాల్లో 2 మిల్లీ మీటర్ల నుంచి 10 మిల్లీ మీటర్ల లోపు వర్షం కురిసింది. ఇక రెండో రోజు సోమవారం తెల్లవారు జాము నుంచే జోరుగా వర్షం కురుస్తూనే ఉంది. ముసురుపట్టి తెరిపిలేకుండా వర్షం పడటంతో రోడ్లన్నీ ఒంగోలు నగరంలో నిర్మానుష్యంగా మారాయి.

## క్లుప్తంగా

### ప్రభుత్వ ఉద్యోగులపై క్రిమినల్ కేసు నమోదు

**ఒంగోలు అర్బన్:** జిల్లా పంచాయతీ కార్యాలయం (డీపీఓ)లో పనిచేసే ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులపై క్రిమినల్ కేసు నమోదైంది. ఇటీవల గ్రామ సచివాలయ కార్యదర్శుల బదిలీల్లో లంచాలు తీసుకొని ప్రక్రియ నిర్వహించారనే ఆరోపణలపై బదిలీల సమయంలో డీపీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ కిషోర్‌బాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్ శివప్రసాద్, డిజిటల్ అసిస్టెంట్ సాయికోటేశ్వరరావులపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం నివేదిక ఆధారంగా సదరు ఉద్యోగుల బ్యాంకు ఖాతాల ద్వారా ఆర్థిక లావాదేవీల ఆధారంగా లంచాలు తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో కలెక్టర్ క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో 2వ పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇప్పటికే జూనియర్ అసిస్టెంట్, ఏఓలను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

### బ్యాంకు మేనేజర్ ఇంట్లో చోరీ

- 50 గ్రాముల బంగారం, 15 గ్రాముల వెండి ఆభరణాలు, కంప్యూటర్ చోరీ

**మార్కాపురం:** పట్టణంలోని భగత్‌సింగ్ నగర్లో అరుణోదయ స్కూల్ ఎదురుగా నివాసం ఉండే ఒక బ్యాంకు మేనేజర్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు సోమవారం రాత్రి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు . వివరాల్లోకి వెళితే.. అరుణోదయ స్కూల్ ఎదురుగా ఉన్న ఇంట్లో గుంటూరులోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ జయప్రతాప్ ఆయన భార్య జయరాణి నివాసం ఉంటున్నారు. ప్రతాప్ గుంటూరులో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి వచ్చి పోతూ ఉంటాడు. ఆయన సతీమణి జయరాణి వారం రోజుల క్రితం తెనాలిలో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం 11 గంటల సమయంలో అదే బజారులో పక్క వీధిలో నివాసం ఉండే వారి కుమారుడు తల్లితండ్రుల ఇంటి దగ్గరికి వచ్చి చూడగా తలుపులు తీసి ఉండడాన్ని గమనించాడు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఉన్న 50 గ్రాముల బంగారు ఆభరణాలు, 15 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక కంప్యూటర్ చోరీకి గురైనట్లు గుర్తించి జయరాణి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సైదులు బాబు క్లూస్ టీం బృందం దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

- ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి , జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

**ఒంగోలు సిటీ:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో ప్రతి నియోజకవర్గంలోని కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పిస్తామన్నారు. జిల్లా కమిటీలు, పార్టీ సంస్థాగత కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మండల, గ్రామస్థాయిల్లో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాస్, 14వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొట్ల రామారావు, చుండూరు రవి, కె.వి.రమణారెడ్డి, నరాల రమణారెడ్డి, ప్రవీణ్, ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, దుంపా చెంచిరెడ్డి, కృష్ణపాటి శేఖర్‌రెడ్డి, చావలి శివప్రసాద్, పిగిలి శ్రీను, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అటవీశాఖ ఉన్నతాధికారిపై ప్రభుత్వానికి ఫిర్యాదు

**మార్కాపురం:** మార్కాపురం అటవీశాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారిపై కొంతమంది ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వానికి, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు పంపించారు. ప్రధానంగా సదరు అధికారి 2021 డిసెంబర్ 6న మాచర్ల పరిధిలో 211 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదుచేశారు. అయితే వీటిని తిరుపతి సెంట్రల్ రెడ్ సాండర్స్ డిపోకు పంపాల్సి ఉండగా సుమారు 6 నెలల పాటు కాలయాపన చేసిన తరువాత 211 ఎర్రచందనం దుంగల్లో 133 దుంగలను మాత్రమే తిరుపతికి పంపి మిగిలిన 78 ఎర్రచందనం దుంగలను మాయం చేసి వాటి స్థానంలో సండ్ర దుంగలను పెట్టారన్నారు. సిట్‌తో దర్యాప్తు చేయిస్తే వాస్తవాలు వెలుగుచూస్తాయని తెలిపారు. 2022–23 ఉద్యోగుల బదిలీల్లో కూడా ప్రభుత్వం జారీచేసిన జీఓను పక్కనపెట్టి ఆ అధికారి తన ఇష్టం వచ్చినట్లుగా బదిలీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు అధికారి తన నివాసానికి ఎటువంటి అనుమతులు లేకుండా సుమారు రూ.25 లక్షలను ఖర్చుపెట్టారని, దోర్నాల రేంజ్‌లోని అటవీశాఖకు చెందిన రెండు క్వార్టర్స్‌ను కూడా ఉపయోగించుకుంటున్నాడని పేర్కొన్నారు. 2020లో నెక్కంటి సెక్షన్‌లో పాతాళ గంగ వద్ద ఉన్న డిపార్టుమెంటు బోటు నీటిలో కొట్టుకుపోయి సుమారు రూ.13 లక్షల నష్టం వాటిల్లిందని, కానీ ఇంత వరకూ ఈ సంఘటనపై ఎలాంటి విచారణ చేయలేదన్నారు. దోర్నాల రేంజ్‌లో ఒక అధికారి జీపును అనధికారికంగా విక్రయించారని పేర్కొన్నారు. పలువురు ఉద్యోగులను కూడా సదరు అధికారి మానసికంగా వేధిస్తున్నాడని ప్రభుత్వానికి పంపిన ఫిర్యాదులో తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తమ ఆర్థిక ప్రయోజనాలను పొందాలంటే మార్కాపురం డివిజన్ కార్యాలయంలో సుమారు రూ.10 వేలు చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. యర్రగొండపాలెం రేంజ్ పరిధిలో ఒక టింబర్ డిపో యజమానిని వేధించి సుమారు రూ.3 లక్షలు తీసుకున్నారన్నారు. వేసవిలో అవగాహన సదస్సు పేరుతో ఒక్కో రేంజ్ నుంచి రూ.లక్షలు డ్రా చేశారని, కానీ ఒకటి రెండు ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించిన మిగిలిన నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ఉద్యోగుల సీనియారిటీ లిస్టులో కూడా అక్రమాలు జరిగాయని, వీటిపై దర్యాప్తు చేయాలని వారు కోరారు. ఈ విషయాలపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారి అందుబాటులో లేరు.

# అధికార యంత్రాంగం అప్రమత్తం


పాకల ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా


ఆలకూరపాడు పురవాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ అన్సారియా


నాగులుప్పలపాడు లో పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

**సింగరాయకొండ:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా తీర ప్రాంత మండలాల్లో సోమవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ తీర ప్రాంత మండలాల్లో పర్యటించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అవసరమైతే ప్రజలకు పాఠశాలలో పునరావాసం కల్పించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీఓ కె.లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ టి.రవి. సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, ఈఓ సుభాని ఉన్నారు.

**టంగుటూరు:** భారీ వర్షాల నేపథ్యంలో పునరావాస శిబిరాల్లో ఆశ్రయం పొందే ప్రజలకు అవసరమైన వసతులు కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. స్థానికంగా గుడిసెల్లో ఉంటున్న 11 గిరిజన కుటుంబాలకు చెందిన 35 మందికి ఇక్కడ ఆశ్రయం కల్పిస్తున్నట్లు తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. వీరిలో 13 మంది ఉన్నారని చెప్పారు. దీంతో కలెక్టర్ వారితో మాట్లాడి భోజనాన్ని పరిశీలించి స్వయంగా వడ్డించారు. శిబిరంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ కె. లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ దేవసేన కుమారి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**నాగులుప్పలపాడు:** అల్పపీడన ద్రోణి ప్రభావం నాగులుప్పలపాడు మండలం పై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న తీవ్ర వర్షంతో చాలా చోట్ల వాగులు పొంగి ప్రవహిస్తుండంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల లోని ప్రజలను నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి తరలించారు. పునారావాస శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పరిశీలించి వారితో మాట్లాడి సహాయ చర్యలపైఆరా తీశారు. నిడమానూరు, కొత్తకోట, హనుమాపురం గ్రామాల్లో లో లెవల్ చప్టాల పనితీరును జేడీ డాక్టర్ బేబిరాణి సిబ్బందితో కలిసి పరిశీలించారు. తీవ్ర వర్షం ప్రభావంతో చాలా గ్రామాల్లో లోతట్టు కాలనీలు నీటితో నిండిపోయాయి. దీంతో ఇళ్ల యజమానులు మోటార్లతో నీటిని బయటకు పంపించుకుంటున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పరిస్థితిని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ మహాలక్ష్మి ఎప్పటికప్పుడు తమ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు.

## గుండ్లకమ్మ నుంచి నీరు విడుదల


గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

**మద్దిపాడు:** మండలంలోని మల్లవరం వద్ద ఉన్న కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయానికి భారీగా నీరు చేరుతోంది. దీంతో జలాశయం నుంచి దిగువకు 12 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఏఈ రామాంజనేయులు తెలిపారు. గుండకమ్మ నది పైభాగంలో భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భారీగా నీరు వచ్చి చేరుతోంది. చిలకలేరు. నల్లవాగు తదితర వాగుల గుండా గుండ్లకమ్మ నదిలోకి నీరు వస్తోంది. దీనికి తోడు సోమవారం వేకువజాము నుంచే భారీ వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్‌లోకి భారీగా నీరు వచ్చే అవకాశం ఉండటంతో నాలుగు గేట్ల ద్వారా 12 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు తెలిపారు. వరద ఉధృతి వచ్చే క్రమంలో మరికొంతనీటిని విడుదల చేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.

## నిందితునికి మూడేళ్ల జైలుశిక్ష

**దొనకొండ:** మహిళను బెదిరించి బంగారు ఆభరణాలతో పారిపోయిన కేసులో నిందితునికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు దొనకొండ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే దొనకొండ అరబస్తాన్ వీధిలో చిలంచర్ల వెంకట రమేష్ చిన్నపిల్లల తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2019 జనవరి 5వ తేదీన రమేష్ బయటకు వెళ్లగా..ఆయన భార్య వెంకట రామలక్ష్మి ఇంట్లో ఉంది. ఆ సమయంలో ఓ వ్యక్తి వాటర్ బాటిల్ అడగా..బాధితురాలు ఇంట్లోకి వెళ్లగానే నిందితుడు ఆమెకు కత్తి చూపించి మెడలో ఉన్న తాళిబొట్లు అపహరించి మోటార్ సైకిల్‌పై పారిపోయాడు. వెంకట రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు పల్నాడు జిల్లా దుర్గి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన చిన్న సత్యానందంగా గుర్తించి అరెస్టు చేశారు. విచారణ అనంతరం సోమవారం సోమవారం జడ్జి ఎస్.శివశంకర్‌రెడ్డి మూడేళ్ల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.



## వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- డీఎంహెచ్ఓ సురేష్ కుమార్

**ఒంగోలు టౌన్:** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ సురేష్‌కుమార్ సూచించారు. జిల్లా ప్రోగ్రాం అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వారం లోగా ప్రసవం కావాల్సిన గర్భిణులు, వికలాంగులు, వృద్ధులను, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. తహసీల్దార్, ఎంపీడీఓల సహకారం తీసుకోవాలన్నారు. తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలని చెప్పారు. ప్రజలు అవసరమైతే 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, ఈగలు వాలిన ఆహారాన్ని తీసుకోరాదని, పాడైపోయిన కూరగాయలు, పండ్లు తినవద్దని సలహా ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా సామాజిక మరుగుదొడ్లను వినియోగించాలన్నారు. భోజనానికి ముందు, మలవిసర్జన తరువాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## హోంగార్డును అభినందించిన ఎస్పీ


హోంగార్డు సీతారాం ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎస్పీ

**కనిగిరి రూరల్:** పారిపోతున్న నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్న కనిగిరి హోంగార్డు సీతారాం ప్రసాద్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించి ప్రశంసాప్రతాన్ని అందచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 13న ఆదివారం సాయంత్రం కనిగిరి పట్టణంలోని దొరువు బజార్ కొండకు సమీపంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో సీసీ కెమెరాలను ధ్వంసం చేసి మూడు కలశ కుండలను నిందితుడు దొంగిలించి పారిపోతున్నాడు. స్థానిక పామూరు బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ సీతారాం ప్రసాద్.. ఘటన విషయాన్ని ఫోన్‌లో ఎస్సైకు సమాచారం అందించాడు. ఎస్సై ఆదేశాల మేరకు హోంగార్డు సంఘటనా స్థలానికి చేరుకొని దొంగ కొండెక్కి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించాడు. దీంతో హోంగార్డు చాకచక్యంగా చొక్కా విప్పుకొని దొంగను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ ఘటనలో కనిగిరికి చెందిన నిందితుడు పోలా అంకయ్యపై కేసు నమోదు చేశారు. నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్న హోంగార్డు సీతారాం ప్రసాద్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించి.. క్యాష్ రివార్డ్, మరియు ప్రశంసాపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో ఐటీ కోర్ సీఐ సూర్య నారాయణ, ఆర్ఐ సీతారామిరెడ్డి తదితరులున్నారు.

## కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన అఖిల్

**కొమరోలు :** కుక్క దాడి చేయడంతో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని బసువపల్లె లో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన ఎ.అఖిల్‌కుమార్‌రెడ్డి అనే 10 ఏళ్ల బాలుడు సోమవారం ఆరుబయట ఆడుకుంటున్న సమయంలో కుక్క బాలుడి కంటిపై తీవ్రంగా గాయపరచినట్లుగా తల్లిదండ్రులు తెలిపారు. దీంతో చికిత్స నిమిత్తం అఖిల్‌కుమార్‌రెడ్డిని 108 వాహనంలో గిద్దలూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# రూ.10 కాయిన్ మేళా


కూరగాయల మార్కెట్‌లో రూ.10 నాణేలు అందిస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

- షాపింగ్ మాల్స్, దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, టీ కొట్లలో నాణేల పంపిణీ

**ఒంగోలు సబర్బన్:** రోజువారీ లావాదేవీల్లో రూ.10 నాణేలు చెలామణీ చేయాలని కెనరా బ్యాంకు అధికారి, ఎల్‌డీఎం రమేష్ పేర్కొన్నారు. రూ.10 నాణేంపై ఉన్న అపోహలను తొలగించేందుకు నగరంలో రెండు రోజుల పాటు ప్రత్యేక ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిజర్వు బ్యాంకు ఆదేశాల ప్రకారం రూ.10 నాణేలను ప్రజలు రోజువారీ లావాదేవీల్లో ఉపయోగించాలన్నారు. అన్ని రాష్ట్రాల్లో రూ.10 నాణేలు చలామణి అవుతున్నాయని, మన రాష్ట్రంలో ఎందుకో ప్రజలు అపోహపడుతున్నారని చెప్పారు. నగరంలోని షాపింగ్ మాల్స్, దుకాణాలు, కూరగాయల మార్కెట్, టీ కొట్లులో రూ.10 నాణేలు అందించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కెనరా బ్యాంకు అధికారులు దిలీప్, జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

# కంభంలో వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం


కంభంలో గ్రామోత్సవంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అమ్మవారు


గ్రామోత్సవంలో వేషధారణలు


కోలాటం చేస్తున్న భక్తులు

**కంభం:** దసరా శరన్నవాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం అర్ధరాత్రి స్థానిక అమ్మవారి శాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టణంలోని జామియా మసీదు సెంటర్, చౌక్‌సెంటర్, రామాలయం వీధి, సాధు మియా వీధి, శీలం వీధి మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో కంభం, సీఐ కె.మల్లిఖార్జున, కంభం ఎస్సై నరసింహారావు 150 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## పీటీసీ ప్రిన్సిపాల్‌గా రాధిక బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రాధిక

**ఒంగోలు టౌన్:** పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జీఆర్ రాధిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె శ్రీకాకాళం ఎస్పీగా పనిచేశారు. బాధ్యతల చేపట్టిన అనంతరం ఆమె ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పీటీసీలోని ఇండోర్, ఔట్‌డోర్ అధికారులతో శిక్షణ కార్యక్రమాల గురించి చర్చించారు. అధికారులు, సిబ్బంది సాదర స్వాగతం పలికారు.